# నమస్తే తెలంగాణ
# సంగారెడ్డి

I | హైదరాబాద్, బుధవారం 3 జూలై 2024 | SANGAREDDY




మంగళ వారం ఎర్రవల్లిలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను కలిసిన సిద్దిపేట జడ్పీ చైర్‌పర్సన్ దంపతులు రోజా రాధాకృష్ణ శర్మ



మంగళ వారం సంగారెడ్డి జిల్లా కంది నుంచి చేర్యాల ప్రభుత్వ పాఠశాలకు వెళ్లే విద్యార్థులు బస్సు ఆలస్యం కావడంతో క్రికెట్ ఆడుతున్న దృశ్యం



ఎర్రవల్లిలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను కలిసిన సంగారెడ్డి జడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ జైపాల్ రెడ్డి కుటుంబం



మంగళ వారం ఎర్రవల్లిలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను కలిసిన మెదక్ జడ్పీచైర్‌పర్సన్ దంపతులు హేమలతా శేఖర్ గౌడ్

# అరకొర బస్సులు.. విద్యార్థుల అవస్థలు

- బడి బస్సులు లేక అవస్థలు పడుతున్న విద్యార్థులు
- మెదక్ జిల్లాలో 14 బస్సులు నడుపుతున్న ఆర్టీసీ అధికారులు
- మరో 10 బస్సులు నడుపాలని విన్నవించిన విద్యార్థుల తల్లిదండ్రులు
- బస్సులు లేక ప్రైవేట్ వాహనాలు, సైకిళ్లపై వస్తున్న విద్యార్థులు
- జిల్లాలో పలు గ్రామాలకు నడువని పల్లె వెలుగులు
- అరకొర నడిసినా ఫుట్‌బోర్డ్‌పై వేలాడుతూ ఫీట్లు చేయాల్సిందే...
- ఆర్టీసీ సేవలపై ప్రజల ఆగ్రహం
- జిల్లాలోని తండాల పరిస్థితి మరీ అధ్వానం
- బస్సులు రాక బడి మానేస్తున్న విద్యార్థులు

మెదక్, జూలై 2 (నమస్తే తెలంగాణ): బడి బస్సులు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. పలు మార్గాల్లో బస్సు సర్వీస్‌లు లేవు. ఉన్న రూట్లలో సమయానికి రాక ఆటోలను ఆశ్రయించాల్సి వస్తోంది. దీంతో విద్యార్థులకు ఇక్కట్లు తప్పడం లేదు. సమయానికి బస్సులు రాకపోవడంతో పాఠశాలలకు వెళ్లలేక పోతున్నామని విద్యార్థులు వాపోతున్నారు. మెదక్ జిల్లాలో జడ్పీ, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు ఉన్నాయి. ఈ పాఠశాలల్లో విద్యనభ్యసించడానికి వేలాది మంది విద్యార్థులు రోజూ పాఠశాలలకు వస్తుంటారు. పరిసర గ్రామాల నుంచి వందలాది మంది విద్యార్థులు నిత్యం వచ్చిపోతుంటారు. వీరి కోసం ఆర్టీసీ డిపో అధికారులు 14 బడి బస్సులను తిప్పుతున్నారు. అవి సరిపోక పోవడంతో జిల్లాలోని ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు మరో 10 బస్సులు తిప్పాలని ఆర్టీసీ అధికారులకు విన్నవించారు. అయితే ఆ బస్సులు రావడానికి మరో నెల రోజుల సమయం పడుతుందని మెదక్ ఆర్టీసీ డీఎం సుధ తెలిపారు. జిల్లాలోని మారుమూల గ్రామాలకు బస్సులు లేక అక్కడి విద్యార్థులు ప్రైవేట్ వాహనాల్లో, సైకిళ్లపై వస్తున్నారు. మెదక్ జిల్లాలోని రామాయంపేట మండలం కాట్రియాల, నిజాంపేట మండలం నస్కల్ గ్రామాలకు బస్సులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాదు కాట్రియాల పరిసర ప్రాంతాల్లో తండాలు ఉన్నాయి. తండాల్లోని గిరిజన విద్యార్థులు సైకిళ్లపై, నడుచుకుంటూ పాఠశాలకు వస్తున్నారు. ఈ రూట్‌లో బస్సులను వేయాలని పలుమార్లు విద్యార్థులు ధర్నాలు చేసినా పట్టించుకున్న పాపాన పోలేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపించారు. జిల్లా పరిధిలోని రేగోడ్‌లో జడ్పీ పాఠశాల ఉంది. కొత్వాల్‌పల్లి, చౌదర్‌పల్లి, తిమ్మాపూర్ తదితర గ్రామాల నుంచి విద్యార్థులు జడ్పీ పాఠశాలకు వెళ్లి చదువుకుంటారు. ఈ రూట్‌లో బస్సులు లేకపోవడంతో ఆటోల్లో పాఠశాలకు వస్తున్నారు. నర్సాపూర్ మండలంలోని అవంచ, ఎల్లాపూర్ గ్రామాలకు పల్లె వెలుగు బస్సులు నడకవపోడంతో విద్యార్థులు ఆటోలు, సైకిళ్లపై పాఠశాలలకు వెళ్తూ అవస్థలు పడుతున్నారు.



సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం సీతారాం కుంట వద్ద బస్సు ఎక్కేముందు ఇబ్బంది పడుతున్న విద్యార్థులు

### బస్సు ఎక్కాలంటే కుస్తీ పట్టాల్సిందే..

మెదక్ పట్టణానికి పరిసర గ్రామాల నుంచి పాఠశాలలు, కళాశాలలకు రోజూ రెండువేల మందికి పైగా విద్యార్థులు వస్తుంటారు. వీరిలో విద్యార్థినుల సంఖ్య ఎక్కువగా ఉంది. ఉదయం పాఠశాల సమయానికి విద్యార్థులతోపాటు సామాన్య ప్రజలు కూడా బస్సుల్లో ప్రయాణిస్తున్నారు. దీంతో విద్యార్థులు ఫుట్‌బోర్డుపై వేలాడుతూ ప్రయాణిస్తున్నారు. ప్రమాదమని తెలిసినా వీరికి మరో మార్గం లేక ఇలా ప్రయాణిస్తున్నారు. సాయంత్రం పాఠశాల ముగిసిన తర్వాత విద్యార్థులు ఇండ్లకు చేరుకోవాలంటే ఫీట్లు చేయాల్సిందే. బస్సులో సీటు మాట దేవుడెరుగు.. ఫుట్‌బోర్డుపై నిలబడేందుకు సాహసం చేయాల్సి వస్తోంది. వెల్దుర్తి మండలంలోని ఆయా గ్రామాల్లో నుంచి వచ్చే విద్యార్థుల్లో చాలామంది ఫుట్‌బోర్డుపై వేలాడుతూ ప్రమాదం అంచు న రాకపోకలు సాగిస్తున్నారు.

# బైక్‌లు, ఆటోలే దిక్కు



హద్నూర్ చౌరస్తాకు వచ్చి బస్సులో వెళ్తున్న విద్యార్థులు

న్యాల్‌కల్, జూలై 2 : సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలంలో మారుమూల గ్రామాల ప్రజలకు పల్లె వెలుగు సేవలు అందడం లేదు. మండలంలోని రేజింతల్, మల్కన్‌పాడ్, న్యామతాబాద్, హుస్సెల్లి, గుంజోట్టి, రాంతీర్థం, చినిగేపల్లి, మల్గి, రత్నాపూర్, మరియంపూర్, రాఘవపూర్, కాకిజనవాడ, అమీరాబాద్, ముర్తుజాపూర్, తాట్‌పల్లి, టేకూర్ తదితర గ్రామాలకు బీటీ రోడ్డు సౌకర్యం ఉన్నా పల్లె వెలుగు బస్సు సౌకర్యం లేక ప్రజలతో పాటు విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విద్యార్థులు కళాశాలలు, పాఠశాలలకు ఆ టోలు, బైక్‌లపై వెళ్తున్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేండ్లయినా మండలంలోని గణేశ్‌పూర్ గ్రామానికి బస్సు సౌకర్యం లేదు. రాజోలా, మామిడ్గి, వడ్డి గ్రామాలకు చెందిన విద్యార్థుల సౌకర్యార్థం ఉదయం, సాయంత్రం మాత్రమే జహీరాబాద్ ఆర్టీసీ డిపో బస్సులను నడుపుతున్నారు. నారాయణఖేడ్ డిపోకు చెందిన బస్సులు జహీరాబాద్, బీదర్ రూట్లలోనే నడుపుతున్నారు.

### బస్సులు నడపాలి



రోడ్డు సౌకర్యం ఉన్నప్పటికీ చాలాగ్రామాలకు ఆర్టీసీ అధికారులు బస్సులు నడపడం లేదు. పాఠశాల, కళాశాల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆటోలు, బైక్‌లపై వెళ్తున్నారు. పేద విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారు. అన్ని గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలి. విద్యార్థుల కోసం ప్రత్యేక బస్సులు నడపాలి

-మారుతీయాదవ్, బీఆర్ఎస్వీ మండల అధ్యక్షుడు

# కాలినడకనే శరణ్యం



దంతెపల్లి నుంచి కాట్రియాల గ్రామానికి వస్తున్న విద్యార్థులు



బస్సులు సమయానికి రాక ఇబ్బందులు పడ్తున్నామంటున్న పల్లె ప్రాంత విద్యార్థులు

రామాయంపేట, జులై 2: మెదక్ జిల్లా రామాయంపేట మండలంలోని దంతెపల్లి, పర్వతాపూర్, లాక్య తండా, సుభాష్‌తండా, తీన్‌నెంబర్ తండా, బాపనయ్య తండా, బాల్య తండాల విద్యార్థులు పదుల సంఖ్యలో కాట్రియాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు వెళ్లి చదువుకుంటున్నారు. వీరికి బస్సు సౌకర్యం ఉన్నా సమయపాలన పాటించక పోవడంతో కాలినడకన వెళ్తున్నారు. ఉదయం 8గంటలు, సాయంత్రం 6.30 గంటలకు బస్సు వస్తున్నది. ఇది వీరికి అనుకూలంగా లేదు. దీంతో విద్యార్థులు వారి గ్రామాల నుంచి బ్యాగుల మోతతో 7కిలోమీటర్లు కాలినడకన రాకపోకలు సాగిస్తున్నారు. నిజాంపేట మండలంలోని నస్కల్ గ్రామ జిల్లా పరిషత్ పాఠశాలకు చుట్టుపక్కల గిరిజన తండాలు, గ్రామాల నుంచి కాలినడకన, ప్రైవేట్ వాహనాల్లో విద్యార్థులు వస్తున్నారు.

### పాఠశాల సమయాల్లో బస్సులు నడపాలి..



విద్యార్థులు పాఠశాలకు వచ్చే సమయాల్లో ఆర్టీసీ అధికారులు బస్సులు నడిపిస్తే విద్యార్థులకు ఇబ్బందులు ఉండవు. మేము కూడా విద్యార్థులకు మంచి చదువులు అందించగలుగుతాం. సమయానికి బస్సులు రాకపోవడంతో విద్యార్థులు కాలినడకనే బడికి వస్తున్నారు. దీంతో వారు టైమ్‌కు బడికి చేరుకోలేక పోతున్నారు. ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

-గణేశ్, టీచర్, కాట్రియాల

### కాలినడకన బడికి పోతున్నం..



ఆర్టీసీ అధికారులు ఉదయం బడి సమయానికి అనుగుణంగా బస్సులు నడపాలి. ఉదయం 9గంటలకు మా గ్రామానికి బస్సు వస్తే పర్వతాపూర్ నుంచి కాట్రియాలకు ప్రార్థన సమయంలో చేరుకుంటాం. ప్రతి రోజు బస్సులు సమయానికి రాక కాలినడకతోనే స్కూల్‌కు వెళ్తున్నాం.

-అరవింద్, పదో తరగతి, పర్వతాపూర్

# బస్సుల్లేక బడికి తిప్పలు

- సంగారెడ్డి జిల్లాలో సగానికిపైగా పాఠశాలలకు బస్సు సౌకర్యం కరువు
- బస్సులు లేక ఆటోల్లో స్కూళ్లకు వెళ్తున్న చిన్నారులు
- కొత్త బస్సులు వస్తేనే పిల్లలకు బస్సు ప్రయాణం



సంగారెడ్డి జిల్లాలో బస్సుకోసం నడుచుకుంటూ వస్తున్న విద్యార్థులు

సంగారెడ్డి, జూలై 2 (నమస్తే తెలంగాణ): సంగారెడ్డి జిల్లాలో బస్సులు లేక బడి పిల్లలు తిప్పలు పడుతున్నారు. జిల్లాలో 1264 ప్రభుత్వ పాఠశాలల ఉన్నాయి. ఇందులో 1.30లక్షలకు పైగా విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. 432 ఉన్నత పాఠశాలల్లో 40వేల మందికి పైగా విద్యార్థులు చదువుకుంటున్నారు. మండల కేంద్రాలతోపాటు మేజర్ పంచాయతీల్లో ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలలు ఉన్నాయి. దీంతో మారుమూల గ్రామాలకు చెందిన విద్యార్థులు తప్పనిసరిగా గ్రామానికి దూరంగా ఉన్న ఉన్నత పాఠశాలలో చేరి చదువుకోవాల్సి వస్తుంది. జిల్లాలో సగానికి పైగా గ్రామాలకు ఆర్టీసీ బస్సులు నడపడం లేదు. సంగారెడ్డి, జహీరాబాద్, నారాయణఖేడ్‌లలో డిపోలు ఉన్నాయి. మూడు డిపోల పరిధిలో 124 పల్లె వెలుగు బస్సులు నడుస్తున్నాయి. అయితే ఈ బస్సులు ఎంపిక చేసిన, ఆర్టీసీకి లాభదాయకమైన రూట్లలో మాత్రమే నడుస్తున్నాయి. దీంతో వారు ప్రయివేటు వాహనాల్లో ప్రయాణించాల్సి వస్తుంది. సంగారెడ్డి డిపో పరిధిలో 20కి పైగా గ్రామాలకు బస్సు సౌకర్యం లేదు. సదాశివపేట మండలం పొట్టిపల్లి, మాలపాడు, బొబ్బిలిగామ గ్రామాలకు బస్సులు పోవడం లేదు. సంగారెడ్డి మండలంలో 10కి పైగా గ్రామాలకు, కొండాపూర్‌లో పదికి పైగా గ్రామాలకు బస్సు సౌకర్యం లేదు. దీంతో ఆ గ్రామాల నుంచి ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. నారాయణఖేడ్ నియోజకవర్గంలో 17 గ్రామాలకు బస్సులు నడవడం లేదు. అందోల్ నియోజకవర్గంలో 30కి పైగా గ్రామాల్లో బస్సు సౌకర్యం లేదు. దీంతో ఆయా గ్రామాల నుంచి పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు రవాణా సౌకర్యం లేక ఇబ్బందులు పడాల్సి వస్తుంది. జహీరాబాద్ డిపో పరిధిలో గ్రామీణ విద్యార్థుల పరిస్థితి ఇలాగే ఉన్నది.

# వేలమంది విద్యార్థులు.. నడిచేది 13 బస్సులే

సిద్దిపేట, జూలై 02: విద్యాలయాలకు నిలయమైన సిద్దిపేట పట్టణానికి విద్యనభ్యసించేందుకు దాదాపు పరిసర గ్రామాలతో పాటు 40 నుంచి 50 కిలోమీటర్ల పరిధిలోని విద్యార్థులు నిత్యం వస్తుంటారు. ఇంతమంది విద్యార్థులకు సిద్దిపేట ఆర్టీసీ డిపో పరిధి నుంచి కేవలం 13 బస్సులు మాత్రమే నడుపుతున్నారు. చాలా గ్రామాలకు బస్సులు రాక విద్యార్థులు కాలినడకన, ప్రైవేట్ వాహనాల్లో బడులకు వెళ్తున్నారు.

విద్యార్థులకు కోసం సిద్దిపేట ఆర్టీసీ డిపో 13 బసులు నడుపుతోంది. ఇందులో నంగునూరు మండలంలో 3, చిన్నకోడూరు మండలంలో 2, సిద్దిపేట రూరల్ మండలంలో 3, నారాయణరావుపేట మండలంలో 2 బస్సులతో పాటు సిద్దిపేట–కామారెడ్డి రూట్లో, సిద్దిపేట– అర్జునపట్ల, సిద్దిపేట–ధూళిమిట్ట రూట్ల లో బసులు నడుపుతున్నది.



సిద్దిపేట జిల్లా రావురూకుల నుంచి పుల్లూరు స్టేజీ వరకు నడుచుకుంటూ వెళ్తున్న విద్యార్థులు

కానీ, చాలా గ్రామాల్లోకి బస్సులు రాక విద్యార్థులు ఆటోల్లో వెళ్తున్నారు. కొన్ని గ్రామాల విద్యార్థులు ప్రధాన రహదారికి 2 నుంచి 3 కిలోమీటర్ల దూరం నడుచుకుంటూ వచ్చి బస్సు ఎక్కాల్సిన దుస్థితి ఉంది. బస్సులు వచ్చినప్పటికీ ఆ రూట్లలో విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉండడంతో, కొన్ని గ్రామాల స్టేజీల వద్ద బస్సులు ఆపడం లేదు. విద్యార్థుల సంఖ్యకు సరిపడా బస్సులు నడపాలని విద్యార్థులు కోరుతున్నారు. సిద్దిపేట డిపో పరిధిలో 12 ఏండ్ల వయసున్న విద్యార్థులకు ఉచిత బస్సు పాసులను ఆర్టీసీ అందించింది. 2023 – 24 విద్యా సంవత్సరంలో ఉచిత బస్సు పాస్‌లు 5127 మందికి, రాయితీపై బస్సు పాసులు 1737 మంది విద్యార్థులకు అందజేసింది. ఈ సారి జూన్ నెల వరకు ఉచిత బస్సు పాసులు బాలురకు 101 మందికి, రైతు బస్సు పాసులు 1001 మందికి జారీ చేశారు. బాలికలకు ఆధార్ కార్డుతో ఉచిత ప్రయాణం ఉండడంతో బస్సు పాసులు జారీ చేయలేదు.

# బస్సులు నడవక విద్యార్థుల అరిగోస

నర్సాపూర్, జూలై 2: నియోజకవర్గ పరిధిలోని గ్రామాలకు బస్సులు సరిగ్గా నడవక విద్యార్థులు అరిగోస పడుతున్నారు. బస్సులు సరిగ్గా రాక, వచ్చినా ఎక్కడానికి స్థలం లేక విద్యార్థులు ఆవేదన చెందుతున్నారు. నర్సాపూర్‌లో బస్‌డిపో ఏర్పాటు చేసినప్పటికీ విద్యార్థుల కష్టాలు మాత్రం తీరడం లేదు. కొన్ని మార్గాల్లో బస్సులు రాకపోవడంతో విద్యార్థులు ప్రైవేట్ ఆటోలను ఆశ్రయించాల్సి వస్తుంది. నర్సాపూర్ మండలంలోని ఎల్లాపూర్, ఆవంచ గ్రామాలకు బస్సులు రాకపోవడంతో విద్యార్థులు కిలోమీటర్ నడిచి బస్సులు ఎక్కాల్సి వస్తుంది. జక్కపల్లి మోడల్ స్కూల్‌కు మూడు బస్సులు వస్తుండగా అవి సరిపోవడం లేదని ఇంకో బస్సు సౌకర్యం కల్పించాలని విద్యార్థులు అధికారులను వేడుకుంటున్నారు. శివంపేట్ మండలంలోని ఉసిరికపల్లి, పాంబండ గ్రామాలకు చెందిన విద్యార్థులు నర్సాపూర్, తూప్రాన్ కళాశాలల్లో చదువుకోవడానికి నిత్యం వెళ్తుంటారు. గతంలో ఈ మార్గంలో బస్సు ఉండేది. ప్రస్తుతం బస్సు సౌకర్యం నిలిపివేయడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. చిలిపిచెడ్ మండల పరిధిలోని సోమక్కపేట్, శీలంపల్లి, ఫైజాబాద్, అజ్జమర్రి, గంగారం గ్రామాలకు చెందిన విద్యార్థులు నిత్యం జోగిపేట్, కౌడిపల్లి మండల కేంద్రాలకు చదువుకోడానికి వెళ్తుంటారు. ప్రస్తుతం ఆ మార్గాల్లో బస్సులు రాక విద్యార్థులు తంటాలు పడాల్సి వస్తుంది. కొల్చారం పరిధిలోని రాంపూర్, కిష్టాపూర్, ఘనపూర్, రంగంపేట్ విద్యార్థులు బస్సుల్లో ఎక్కడానికి ఫీట్లు చేస్తూ ఫుడ్‌బోర్డ్‌లో ప్రయాణించాల్సి వస్తుంది. ఉదయం బస్సులు నిండుగా రావడంతో స్టాప్‌ల వద్ద ఆపడం లేదని విద్యార్థులు పేర్కొంటున్నారు. కొల్చారం, వెల్దుర్తి కళాశాలలకు వెళ్లే అంసాన్‌పల్లి, కొంగోడ్, జలాల్‌పూర్ మార్గాల్లో బస్సులు సమయానికి నడపాలని విద్యార్థులు కోరారు. కౌడిపల్లి నుంచి వెల్దుర్తి మండలం అందుగులపల్లి గ్రామాల మధ్యలోని లింగంపల్లి, కొటాల, వెల్మకన్న గ్రామాలకు బస్సు సౌకర్యం నిలిపివేడయంతో విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు.



కొల్చారం బస్టాండ్‌లో కిక్కిరిపోయిన బస్సు ఎక్కుతున్న విద్యార్థులు

### బస్సులు ఆప్తలేరు.. ఆపినా తిట్టి దింపేస్తున్నరు

కొల్చారం, జూలై 2: రాంపూర్, కిష్టాపూర్, పోతంశెట్టి పల్లి, ఘనపూర్ గ్రామాల నుంచి కొల్చారం వస్తాం. స్కూల్, కాలేజ్ కలిపి రెండు వందల మంది దాకా ఉన్నాం. మాకు బస్సులు ఆప్తలేరు. పొద్దుగాల్ల టైంకు కలేజ్‌కి అందుతలేం. బస్సులు జనాలతో నిండడంతో డ్రైవర్, కండక్టర్లు మమ్ములనే తిట్టి దింపేస్తుండ్రు. సాయంత్రం కూడా లేట్ అయితాంది. బస్సుల్లా ఎక్కే గ్యారంటీ లేక ఇంకా బస్సు పాసులు తీయలే. బస్సులో ఎక్కనియ్యకపోతే ఆటోలో ఎక్కిపోతున్నం. స్కూల్ పిల్లలు సాయంత్రం లేట్ అయితే వాళ్ల దగ్గర డబ్బులు లేక తెలిసిన వాళ్ల దగ్గర పైసలు అడిగి ఆటోలో పోతుండ్రు. ఫ్రీ బస్ లేక ముందు ఇంత ఇబ్బంది లేకుండే.

- శ్రీశైలం, వర్ధన్ కిష్టాపూర్ గ్రామం, ఇంటర్ ఎంపీసీ గవర్నమెంట్ జూనియర్ కాలేజ్ కొల్చారం



బస్సు ప్రయాణంలో ఇబ్బందులను వివరిస్తున్న విద్యార్థులు

# సమయపాలన పాటించని బస్సులు

## ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థులు

గజ్వేల్, జూలై 2: గజ్వేల్ నియోజకవర్గంలోని గజ్వేల్, జగదేవ్‌పూర్, వర్గల్, ములుగు, మర్కూక్, కొండపాక, కుకునూర్‌పల్లి మండలాల్లోని చాలా గ్రామాలకు ఆర్టీసీ సేవలు సరిగ్గా అందడం లేదు. బస్సుల సమయపాలన పాటించక పోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జగదేవ్‌పూర్ మండలంలోని తీగుల్‌నర్సాపూర్, అంతాయిగూడ, జంగంరెడ్డిపల్లి, రాయవరం, పలుగుగడ్డ, దౌలాపూర్, బీజీ వెంకటాపూర్ గ్రామాల విద్యార్థులు నిత్యం పాఠశాలలకు వెళ్లేందుకు ఆటోలే దిక్కవుతున్నాయి. కొంతమంది విద్యార్థులు కాలినడకన పాఠశాలకు వెళ్తున్నారు. వర్గల్ మండలంలోని గోవిందాపూర్, గిర్మాపూర్, నెంటూర్, మైలారం గ్రామాల మీదుగా వచ్చే బస్సులు సమయపాలన పాటించకపోవడంతో విద్యార్థులు చాలా సందర్భాల్లో సమయానికి పాఠశాలకు చేరుకోలేకపోతున్నారు. గజ్వేల్ మండలం దాతర్‌పల్లి, రంగంపేటకు బస్సు సౌకర్యం లేక విద్యార్థులు ఆటోలోనే వెళ్తున్నారు. ములుగు మండలంలోని చాలా గ్రామాల్లో ఇదే పరిస్థితి ఉంది. కొండపాక, కుకునూర్‌పల్లి మండలాల్లోని బొబ్బాయిపల్లి, తిప్పారం, మేధినిపూర్, మంగోల్ గ్రామాలకు చెందిన విద్యార్థులు సమయానికి ఆర్టీసీ బస్సులు రాకపోవడంతో నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గజ్వేల్–ప్రజ్ఞాపూర్ డిపో పరిధిలో విద్యార్థుల కోసం ప్రత్యేకంగా 11 ఆర్టీసీ బస్సులు 44 రూట్లలో ప్రతిరోజూ గ్రామాల మీదుగా తిరుగుతున్నాయి. ఒక్కో బస్సు మూడు నుంచి నాలుగు గ్రామాలకు వెళ్తున్నది. వీటితో పాటు ప్రధాన మార్గాల్లోని భువనగిరి, సంగారెడ్డి, సికింద్రాబాద్, రామాయంపేట, దుబ్బాక ప్రాంతాల్లోని బస్సుల్లో ప్రయాణం చేస్తున్నారు.

### దుబ్బాకలో అరకొర బస్సులతో అవస్థలు

దుబ్బాక, జూలై 2: దుబ్బాక డిపోలో అరకొర బస్సులతోపాటు సిబ్బంది కొరతతో పలు రూట్లలో బస్సులు తిరగడం లేదు. దీంతో ఆటోలు, ప్రైవేట్ వాహనాలు, సైకిళ్లపై విద్యార్థులు బడికి, కళాశాలలకు వెళ్తున్నారు. దుబ్బాక డిపోలో 30 ఆర్టీసీ బస్సులు, 8 అద్దె బస్సులు ఉన్నాయి.10 రూట్లలో బస్సులు కొనసాగుతున్నాయి. మహాలక్ష్మి పథకంతో నియోజకవర్గంలో దుబ్బాక డిపోకు చెందిన బస్సులు మాత్రమే కొనసాగుతున్నాయి. గతంలో మాదిరిగా ఇతర డిపోల బస్‌లు నడిపించకపోవడంతో సమస్యగా మారింది. దుబ్బాక–ముస్తాబాద్ రూట్‌లో కేవలం ఒక బస్సు మాత్రమే కొనసాగించడంతో సమస్యగా మారింది. దుబ్బాక నుంచి సిద్దిపేట వయా చేర్వాపూర్ మీదుగా బస్ నడపకపోవడంతో విద్యార్థులు 2 కి.మీ వరకు నడిచి వెళ్తున్నారు. మిరుదొడ్డి మండలం మోతె, బేగంపేట, చెప్యాల, జంగపల్లి, వీరారెడ్డిపల్లి గ్రామాలకు బస్ లేకపోవడంతో ఆటోల్లో బడికి వెళ్తున్నారు. దౌల్తాబాద్, రాయపోల్ మండలాల్లో మాచిన్‌పల్లి, గొల్లపల్లి, రామారం, వడ్డేపల్లి గ్రామాలకు బస్సులు లేక ఆటోలు, ఇతర వాహనాలపైనే వెళ్తున్నారు.

# రవాణా శాఖ మంత్రి ఇలాఖాలో బస్సులెరుగని పల్లెలు

హుస్నాబాద్, జూలై 2: ఆర్టీసీ బస్సులు లేక బడికి వెళ్లేందుకు విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. హుస్నాబాద్ ఆర్టీసీ డిపో పరిధిలోని హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ మండలాల్లో కొన్ని గ్రామాలకు మాత్రమే బస్సు సౌకర్యం ఉంది. మిగతా గ్రామాలకు బస్సుల్లేక విద్యార్థులు బడికి వెళ్లాలంటే ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సి వస్తుంది. రవాణా శాఖ మంత్రి ఇలాఖాలో ఇప్పటికీ పలు పల్లెలు ఎర్ర బస్సు ఎరుగకుండా ఉండటం విశేషం. దీంతో ఆయా పల్లెల్లోని విద్యార్థులు, మహిళలు ప్రభుత్వం ఇస్తున్న రాయితీలను వినియోగించుకోలేని పరిస్థితి ఉంది. హుస్నాబాద్ మండలంలోని పొట్లపల్లి నుంచి హుస్నాబాద్‌కు బస్సు సౌకర్యం లేక విద్యార్థులు మూడు నాలుగు కిలోమీటర్లు నడిచి హుస్నాబాద్‌లోని హైస్కూల్‌కు రావా ల్సి వస్తోంది. ఉమ్మాపూర్, మడద, భల్లూనాయక్‌తండా, బంజేరుపల్లి గ్రామాలకు బస్సు సౌకర్యం లేదు. కోహె డలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు వివిధ గ్రామాల నుంచి విద్యార్థులు వస్తుంటారు. కూరెల్ల నుంచి కోహెడకు బస్సు లేకపోవడంతో రెండు కిలోమీటర్లు నడవాల్సివస్తోంది. శనిగరం, పరివేద, శ్రీరాములపల్లి, గొట్లమిట్ట, నకిరెకొమ్ముల గ్రామాలకు బస్సు లేక విద్యార్థులు, ఇతర పనులకు వెళ్లే వారికి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అక్కన్నపేట మండలంలోని మైసమ్మవాగుతం డా, పంతుల్‌తండా, మంచినీళ్లబండ, కపూర్‌నాయక్‌తండా, మసిరెడ్డితండాకు ఇప్పటికీ బస్సు సౌకర్యం లేదు. ఆయా గ్రామాల విద్యార్థులు హైస్కూల్‌కు వెళ్లాలంటే నడిచి వెళ్లాల్సిందే. గుబ్బడి నుంచి జనగామ హైస్కూల్‌కు విద్యార్థులు నడిచి లేదా సైకిల్‌పై రావాల్సిందే.



హుస్నాబాద్ ఆర్టీసీ డిపో